మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించుకోవాలి


మట్టి గణనాథుడి ఏర్పాట్లు పరిశీలిస్తున్న మధుయాష్కీగౌడ్

నాగోలు: మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించుకోవాలని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ పేర్కొన్నారు. తిరంగా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ సమతాపురి కాలనీలో ఏర్పాటు చేస్తున్న 63 అడుగుల మట్టి గణనాథుడి విగ్రహాన్ని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మట్టి గణనాథుడిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పకృతి, పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, నాయకులు కొండోజు శ్రీనివాస్, దాము మహేందర్ యాదవ్, రమేష్, నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న సురేందర్ యాదవ్

నాగోలు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్ అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని సహదేవ్ సింగ్ నగర్‌లో ఆదివారం సురేందర్ యాదవ్ మొక్కలు నాటి మాట్లాడారు. నేను అమ్మ పేరిట మొక్క నాటానని మీరు కూడా మీ అమ్మకి గుర్తుగా మొక్క నాటాలన్నారు. స్వచ్ఛమైన గాలి ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

చాదర్‌ఘాట్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన మలక్‌పేటలో మాట్లాడుతూ.. సోమవారం సోమాజిగూడలోని సంస్కృతి రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్లో ఫ్రీ మెగా సర్జికల్ కరెక్షన్ అండ్ హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ హరి చందన, ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ హాజరవుతారన్నారు.

మాంసం వ్యర్థాలను స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలి


మురారి

చాదర్‌ఘాట్: మాంసపు దుకాణాదారులు వ్యర్థాలను ఇష్టానుసారంగా పారబోయకుండా స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాంసపు వ్యర్థాలను రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో వేస్తే కుక్కలు తీసుకెళ్లి వినాయక మండపాల వద్ద వేసే అవకాశం ఉంటుందని దీనివల్ల ఇతర సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. నిర్వాహకులు ఈ సూచనలను పక్కాగా పాటించాలన్నారు. రోజు వ్యర్థాలను నిల్వచేసుకుని స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని ఇష్టానుసారంగా పారబోస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించార.

రోడ్లపై మురుగు పరుగు

దిల్‌సుఖ్‌నగర్: గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు మలక్‌పేట జోన్ పరిధిలోని నాలాలు పూడుకుపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. నాలాల్లో ఎప్పటికప్పుడు పూడికతీత చేపట్టకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓల్డ్‌మలక్‌పేట్, ఎన్‌టీఆర్‌నగర్, సరూర్‌నగర్, అక్బర్‌బాగ్, మూసారంబాగ్, సైదాబాద్, కుర్మగూడ తదితర డివిజన్లలో డ్రైనేజీ పైపులు లీకై మురుగు ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథులే లేరని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఖాళీ స్థలం డంపింగ్‌కు నిలయం

దుర్వాసన, దోమల వ్యాప్తితో ఇబ్బందులు

- యజమానుల నిర్లక్ష్యమంటున్న కాలనీవాసులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు


సింగరేణి కాలనీలోని ఖాళీ స్థలంలో వేసిన వ్యర్థాలు

సైదాబాద్: కాలనీలు, బస్తీల్లోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, చెత్త పారబోస్తుండటంతో దుర్గంధంగా మారుతుందని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లలో భారీగా చెత్త పేరుకుపోతోంది. ఎప్పుడో ఏర్పడిన ఆయా కాలనీల్లో అక్కడక్కడ కొన్ని ప్లాట్లు చాలా కాలంగా ఖాళీగానే ఉంటున్నాయి. ఇదే అవకాశంగా చేసుకుంటున్న పలువురు ఆ స్థలాల్లో చెత్త, వ్యర్థాలు పారబోస్తుండటంతో ముక్కుపూటలదిరే దుర్వాసన వస్తోందని కాలనీలవాసులు వాపోతున్నారు.

ప్లాట్ల యజమానుల తీరుతోనే..

సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలలో ఖాళీ స్థలాల యజమానుల వ్యవహరిస్తున్న తీరు ఇక్కడ సమస్యను అధికం చేస్తుంది. ఎప్పుడో ఇక్కడ స్థలాలు కొన్న వారు ఆయా ప్లాట్లలో ఎలాంటి నిర్మాణాలు చేయకుండా వదిలేసారు. వారు నగరంలోనే దూరంగా ఎక్కడో ఉండటం, ఇక్కడి స్థలాలను పట్టించుకోక పోవటమే అసలు సమస్యకు దారి తీస్తుంది. ఖాళీ స్థలాల్లో పడేస్తున్న వ్యర్థాల లోంచి వస్తున్న దుర్వాసనతో ఇళ్లలో ఉండలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు దోమలు ఈగలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు.

అధికారులు దృష్టి సారించాలి..

కాలనీల్లోని ఖాళీ ప్లాట్ల పర్యవేక్షణ పట్ల ఉదాసీనంగా వ్యవహరించే యజమానులపై జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. మురికి కూపంలా మారిన ప్లాట్లను వాటి యజమానులు వెంటనే శుభ్రం చేయించాలి. ఖాళీ స్థలాల యజమానులకు జీహెచ్‌ఎంసీ అధికారులు జరిమానాలు విధించాలని కోరుతున్నారు. కాలనీల్లోని తమ ఖాళీ ప్లాట్లను వాటి యజమానులే సంరక్షించుకోవాలి. ఎంతో కాలంగా ఖాళీగా ఉన్న తమ స్థలాలను సంరక్షించుకోక పోతే అవి కబ్జాలకు గురయ్యే ప్రమాదం ఉంది. యజమానులు అనవసరపు వివాదాల్లో ఇరికే అవకాశం ఉంటుందని యజమానులు గుర్తించాలి. తమ ఖాళీ ప్లాట్లకు యజమానులు రక్షణ చర్యలు తీసుకోవాలి. వాటికి ప్రహరీ, గేట్లు ఏర్పాటు చేసుకోవాలని స్థానికులు పేర్కొంటున్నారు.

ఇతరులను ఇబ్బంది పెట్టొద్దు



ఖాళీ స్థలాల్లోవ్యర్థాలు, చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన కారణంగా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్ల యజమానుల తీరుతో ఇతరులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించాలి. ఆయా ప్లాట్ల యజమానులు తమ స్థలాలను తామే సంరక్షించుకోవాలి. తద్వారా ఎవరూ ఖాళీ ప్లాట్లలో చెత్త వేయకుండా నియంత్రించవచ్చు.

–షేక్ మహమూద్,
ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు


మధురాపురి కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచి సమస్యను వెంటనే పరిష్కరిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్‌లోని మధురాపురి కాలనీలో ఆదివారం ఆయన మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. నూతన రోడ్డు వేసేందుకు రోడ్డును తవ్వి 45 రోజులైనా పనులు చేయకపోవటంతో కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. డ్రైనేజీ పొంగి మురుగు రోడ్లపై పారుతుందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సమస్య పరిష్కరించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం పద్ధతి కాదని జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట శ్రీశైలంయాదవ్, రవిచారి, సుధీర్‌గౌడ్, విక్కి, విజయ, సాయినాథ్, సాయి కిరణ్, లక్ష్మణ్ కృష్ణ ఉన్నారు.

స్థలాలను వినియోగంలోకి తీసుకురావాలి

ఆల్ ఇండియా దళిత క్రైస్తవ సంఘ సమాఖ్య అధ్యక్షుడు జెరూసలేం ముత్తయ్య


స్థలాల సర్క్యులర్‌ను చూపిస్తున్న జెరుసలేం ముత్తయ్య

బడంగ్‌పేట్: క్రైస్తవుల సమాధుల కోసం కేటాయించిన స్థలాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చూడాలని ఆల్ ఇండియా దళిత క్రైస్తవ సంఘం సమాఖ్య అధ్యక్షుడు జెరూసలేం ముత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బాలాపూర్‌లో క్రైస్తవులకు కేటాయించిన స్థలాలను వారికే కేటాయించి వినియోగం తేవాలని కోతుతూ.. సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరుసలేం ముత్తయ్య మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం మండలం ఖల్సా గ్రామంలో 5 ఎకరాలు, మహేశ్వరం మండలంలోని గంగారంలో 10 ఎకరాలు, ఫరూక్‌నగర్ మండలం, చౌలపల్లిలో 3 ఎకరాలు, కొత్తూరు మండలం, కొడిచర్లలో 2 ఎకరాలు, బాలాపూర్ మండలం కుర్మల్‌గూడలో 2 ఎకరాల చొప్పున 6 సంవత్సరాల క్రితం 2019–20లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం క్రైస్తవ సమాధులకు ప్రభుత్వ భూమిని కేటాయించిందని తెలిపారు. అయితే ఆయా భూముల్లో సమాధులు పెట్టడానికి కమిటీలను ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. ఇట్టి భూముల్లో సమాధులకు వినియోగించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కరోనా సమయంలో చనిపోయిన 19 మంది క్రైస్తవులను పూడ్చిపెట్టేందుకు కుర్మల్‌గూడలో స్థలం తాత్కాలికంగా కేటాయించారన్నారు. నాడు ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రెండు నెలల తర్వాత రద్దు చేశారన్నారు. నేడు గ్రేటర్ హైదరాబాద్‌లో క్రైస్తవ సమాధులకు స్థలం దొరకని దుస్థితి ఉందన్నారు. ప్రస్తుతం హైకోర్టు స్టే ఆర్డర్‌తో కుర్మల్‌గూడలో బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని క్రైస్తవ సమాధులకు వినియోగిస్తున్నామన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కేటాయించిన ప్రభుత్వ స్థలాల్లో అధికారిక గ్రేవ్ యార్డు కమిటీలను నిజమైన పాస్టర్లు, క్రైస్తవ నాయకులతో, స్థానిక ఎమ్మార్వోలతో ఎంపిక చేసి సత్వరమే నిధులు కేటాయించి వినియోగంలోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను పార్టీల పరంగా చూడకుండా గ్రేవ్ యార్డు కమిటీలు ప్రకటించి క్రైస్తవులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవం

చైతన్యపురి: విశ్వహిందూ పరిషత్ వివేకానంద జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం మధురాపురి కాలనీలో వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. అనంతరం మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. నేటి తరానికి పండుగల విశిష్టతలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతాచారి, బాలరాజేశం, రాంకుమార్, సుధీర్, విజయాగాంధీ పాల్గొన్నారు.



రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.35, వంకాయ రూ.23, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.21, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.47, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.13, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.23, మునగ రూ.23, కందగడ్డ రూ.35, బీట్‌రూట్ రూ.21, కీర రూ.18, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.45. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.


శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా చిన్నారులు చిన్ని కృష్ణుని వేషధారణలో ఆకట్టుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. ముసారాం బాగ్‌లో నద్విత్ కార్తికేయ, అభిరాం శ్రీనివాస్‌లు ఇలా అలరించారు.
– సాక్షి, సిటీబ్యూరో

నేటి నుంచి హబీబ్ మియా దర్గా ఉర్సు



పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ న్యూ బాబానగర్‌లోని హబీబ్ మియా దర్గాలో 23వ ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని ముతవల్లీ హబీబ్ అష్రఫ్ తెలిపారు. మంగళవారం మగ్రీబ్ నమాజ్ అనంతరం షాహిన్‌నగర్ చౌరస్తా నుంచి సందల్ ఊరేగింపు మొదలై పహాడీషరీఫ్ బాబా షర్ఫొద్దీన్ దర్గాకు చేరుకుంటుందన్నారు. పూలు, ఛాదర్ సమర్పించిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు కొనసాగుతాయి. 19న దీపారాధన, 20వ మహి ఫిల్ ఖుల్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ ఉత్సవాలకు నగరంతో పాటు జిల్లాల నుంచి భక్తులు విచ్చేస్తారని దర్గా కమిటీ సభ్యులు సాల్తై హదిలా, అబ్దుల్ రహెమాన్, హాజీలు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో గణేశ్ ఉత్సవాలను నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న కోటేశ్వరావు

హస్తినాపురం: గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధ, శాంతిసామరస్యంతో నిర్వహించుకోవాలని ఎల్‌బీనగర్ అడిషినల్ డీసీపీ కోటేశ్వర్‌రావు అన్నారు. భాగ్యనగర్ ఉత్సవ కమిటీ హస్తినాపురం డివిజన్ కన్వీనర్ రాఘవేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ రోడ్డులోని పూజ బాంకెట్‌హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి మండపంలో శుభ్రత, శాంతి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రావినూతల శశిధర్ మాట్లాడుతూ.. గణేశ్ నవవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నవీన్‌కుమార్, నరేశ్‌యాదవ్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు మెడికల్ కిట్లు అందజేత


మెడికల్ కిట్లు అందజేస్తున్న కృష్ణకుమార్

మన్సూరాబాద్: గిన్నిస్‌బుక్ రికార్డ్ హోల్డర్ పర్యావరణవేత్త డా. పెండెం కృష్ణకుమార్ మన్సూరాబాద్ శైలజాపురికాలనీలోని ప్రభుత్వ దివ్యాంగుల హాస్టల్ విద్యార్థులకు సీలింగ్ ఫ్యాన్లు, నోటీసు బోర్డు, మెడికల్ కిట్లు, ఆట వస్తువులు, వాటర్‌క్యాన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 33 సంవత్సరాలుగా సమాజ సేవ చేస్తున్నానని, విద్యార్థుల్లో పర్యావరణపై అవగాహన పెంపొందించేందుకు క్లాత్‌బ్యాగులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ ఇన్‌చార్జి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల అందజేత


కృత్రిమ అవయవాలు ధరించిన దివ్యాంగులతో వందన అగర్వాల్

సైదాబాద్: కృత్రిమ అవయవాలతో దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతోందని ప్రముఖ సాధువులు లలిత్‌ప్రభు సాగర్‌జీ, భక్తిరత్న సురీశ్వర్‌జీ మహరాజ్ అన్నారు. ఆదివారం నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో చంపాపేటలోని మినర్వా గార్డెన్స్‌లో ఉచిత నారాయణ్ ఆర్టిఫిషియల్ లింబ్ అండ్ కాలిపర్స్ ఫిట్‌మెంట్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన 783 మంది దివ్యాంగులకు అధునాతన జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన 851 రకాల నారాయణ్ కృత్రిమ అవయవాలను అందించారు. కృత్రిమ అవయవాల వినియోగం, సంరక్షణపై శిక్షణ పొందిన దివ్యాంగులు చక్కగా నడుస్తూ పరేడ్ చేశారు. ఈ సందర్భంగా సంస్థాన్ డైరెక్టర్ వందన అగర్వాల్ మాట్లాడుతూ.. 1985లో స్థాపించబడిన నారాయణ్ సేవా సంస్థాన్ ఇప్పటి వరకు 40 వేల మందికి పైగా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థాన్ అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్, చతుర్వేది పుటుకూరు, సురేష్ మలాని, మహేష్ అగర్వాల్, మాధవి దంతారిక, అల్కా, దేవేంద్ర చౌబీసా, భగవాన్ ప్రసాద్, రోహిత్ తివారి పాల్గొన్నారు.

నూతన డ్రైనేజీ పైపులైన్ వేయాలి


డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: పురాతన డ్రైనేజీ పైపులైన్ల కారణంగా మురుగు ఏరులై పారుతుందని నూతన లైన్ ఏర్పాటు చేయాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి ఆదివారం ఆయన డివిజన్‌లోని పలు కాలనీల్లో పర్యటించారు. కమర్షియల్ దుకాణాలు, ప్రైవేటు హాస్టల్లు ఎక్కువగా ఉండటంతో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని అధికారులను కోరారు. డ్రైనేజీ పొంగి దుర్వాసనతో కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్య పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు.

ప్రత్యేక చర్యలతో దోమలకు చెక్

- వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి
- నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు
- సాక్షితో సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డి



ఎల్‌బీనగర్: తరచూ కురుస్తున్న వర్షాలతో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు బారినపడే ప్రమాదం ఉంటుందని దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ జోనల్ సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవ రెడ్డి అన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఎల్‌బీనగర్ జోనల్ పరిధి ఐదు సర్కిళ్ల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

ప్రశ్న: దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: దోమల నివారణకు ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాం. ఇంట్లో ఉండే ప్లాస్టిక్ డబ్బాలు, కుండీలు, కూలర్లు, పాతటైర్లలో నీరు నిల్వ లేకుండా ఉంచాలి. దోమల వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా చర్యలు తీసుకోవాలి.

ప్రశ్న: ఎంతమంది సిబ్బందిని నియమించారు?

జవాబు: దోమల నివారణకు ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో సుమారుగా 400మంది సిబ్బందితో ప్రతి రోజు ప్రతి డివిజన్‌లో దోమల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలతో పాటు నిత్యం ఫాగింగ్ చేపటుతున్నాం.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎన్ని డెంగీ కేసులు నమోదయ్యాయి?

జవాబు: ప్రస్తుతం ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో 63 డెంగీ, 6 మలేరియా, 2 చికున్ గున్యా కేసులు నమోదయ్యాయి. డెంగీ కేసులు నమోదైన ఇంట్లో దోమల నివారణకు ప్రత్యేక ఫాగింగ్ చేపడుతున్నాం. పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ఎన్ని ఫాగింగ్ మిషన్లు వాడుతున్నారు?

జవాబు: దోమల నివారణకు మూడు సర్కిళ్ల పరిధిలో 11 చిన్న మిషన్లు, 11 పోర్టబుల్ మిషన్లు, ప్రతి సర్కిల్‌కు రెండు పెద్ద మిషన్లు ఉన్నాయి. వీటితో ప్రతి రోజు కాలనీలో ఫాగింగ్ చేస్తున్నాం.

ప్రశ్న: చెరువుల్లో దోమలు వృద్ధి చెందకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: వర్షాకాలం రాకముందే చెరువులలో గుర్రం డెక్కలను తొలగించాం. దోమలు వృద్ధి చెందకుండా యాంటీలార్వా ఆపరేషన్ ప్రారంభించాం. డ్రోన్లతో దోమల నివారణకు పిచికారీ చేస్తున్నాం. చాలా వరకు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నాం.